క్లుప్తంగా

శుభకార్యాల్లో వెంకటేగౌడ


సుద్దగుంట్లపల్లిలో పూజల్లో వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట, బట్టందొడ్డి, సుద్దగుండ్లపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన అమ్మవారి జాతరలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా శివాడి గ్రామంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ.బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, జిల్లా కార్యదర్శి శంకరప్ప, సర్పంచ్‌లు భాస్కర్, ధనంజయ పాల్గొన్నారు.

బేరుపల్లిలో ఘనంగా గంగజాతర


ఆలయానికి వస్తున్న వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని బేరుపల్లిలో బుధవారం గంగమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి సర్వదర్శనానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ స్థానిక నాయకులతో కలిసి అక్కడ జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో వి.కోటలో జాతర

వి.కోట: వి.కోటలోని శ్రీ గంగమాంబ అమ్మవారి జాతర జూన్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కార్తికేయన్ బుధవారం తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. ఈనెల 26వ తేదీ చాటింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జూన్ 1వ తేదీ అంకురార్పణ జరుగుతుందని తెలిపారు. 2వ తేదీ రాత్రి శిరస్సు, పూలగెరిగ, పుష్పపల్లకి నిర్వహిస్తారని పేర్కొన్నారు. 3వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశము ఉంటుందని తెలిపారు. భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పసుపు,కుంకుమ అందజేత


పావనికి అమ్మవారి పసుపు కుంకుమ ఇస్తున్న నరేష్

పలమనేరు: పలమనేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ ఎన్.వెంకటేగౌడ సతీమణి పావనికి వారి స్వగృహంలో గంగమ్మ జాతరకు సంబంధించిన అమ్మ వారి సారె, పసుపు, కుంకుమ, గాజులను గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ కందల నరేష్ అందజేశారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


వైద్యశిబిరానికి వచ్చిన కంటి సమస్యల బాధితులు

పెద్దపంజాణి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆర్ఎల్ జాలప్ప ఆస్పత్రి, కోలారు వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి తెలిపారు. వైద్యశిబిరంలో పాల్గొన్న 56 మందికి డా.హర్షితారెడ్డి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వీరందరికి కోలారు జాలప్ప ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు.

వర్షం..దోస పంటకు నష్టం


పెద్దగొట్టిగల్లులో వర్షపు నీటిలో దోస పంట

రొంపిచెర్ల: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి దోస పంట నీటిలో కుళ్లుతోంది. మండలంలో ఈ ఏడాది 800 ఎకరాల్లో రైతులు దోస పంటను, 650 ఎకరాల్లో టమాట పంటను సాగు చేశారు. అయితే ఆశించిన ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే వర్షం దెబ్బతో పంట పూర్తిగా పోయిందని రైతులు విలపిస్తున్నారు. ఈ ఏడాది దోస, టమాట పంటలు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు అందరు అప్పులపాలయ్యారు. ప్రభుత్వం రైతులు పడించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో వ్యవసాయ పంటలు చేసేందుకు రైతులు భయపడే పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు పండించిన వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఊరంతా జాతర


జాతరలో జన సందడి

- పోటెత్తిన భక్తజనం
- పట్టణ నలుమూలలా ట్రాఫిక్ బంద్
- వివాదంగా మారిన వీఐపీ పాసులు

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా చివరిరోజు అమ్మవారి విశ్వరూప దర్శనానికి జనం పోటెత్తారు. విశ్వరూపదర్శనం అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టణ పొలిమేర్లలో వాహనాలను నిలిపివేసి అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. దీంతో కుప్పం వాహనాలతో పాటు జనసందోహంతో కిక్కిరిసింది. క్యూలో భక్తులు గంటల తరబడి నిరీక్షించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

వీఐపీ పాసుల వివాదం

అమ్మవారి దర్శనం కోసం ఆలయ కమిటీ ప్రవేశపెట్టిన వీఐపీ పాసులు వివాదాన్ని రేపాయి. వీఐపీలకు పాసులు ఇస్తున్నట్లు ముందుగా ఆలయ కమిటీ ప్రకటించలేదు. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు నిర్ణయం తీసుకుని అనుకూలమైన వ్యక్తులకు, అధికార పార్టీ నేతలకు పరిమితం చేశారు. కేవలం అధికార పార్టీ నేతలకు మాత్రమే పంపిణీ చేయడంతో అమ్మవారి జాతరలో ఇలాంటి రాజకీయాలు కమిటీకి తగదని పలువురు విమర్శిస్తున్నారు. పాసులను పోలీసులకు, పత్రికా విలేకరులకు, జాతరలో విధులు నిర్వహించిన అధికారులకు సైతం ఇవ్వకపోవడం దారుణం.

విచిత్ర వేషధారణలతో భక్తులు...

శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబకు ఎంతో ఇష్టమైన వేషధారణలతో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్త్రీ వేషధారణలు, గంగమ్మ రూపాలు, మహాభారత పాత్రదారుల వేషధారణలతో డప్పులు వాయిస్తూ నాట్యం చేస్తూ తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమతో కూడిన సారెను చెల్లించారు.


విచిత్ర వేషధారణలో భక్తులు


అమ్మవారి విశ్వరూపం

దర్శనానికి టికెట్లా?

వీఐపీ దర్శనం పేరిట ప్రత్యేకంగా పాసులు ముద్రించి పంపిణీ చేశారు. దీన్ని సామాన్య ప్రజలు ప్రశ్నించినందుకు టికెట్లు పెట్టారు. ప్రత్యేక దర్శనం అంటూ రూ.100, రూ.200 నిర్ణయించి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. కమిటీ సభ్యులు అనుకూలమైనా వ్యక్తులకు ఉచితంగా వీఐపీ పాసులు, మిగిలిన వారికి టికెట్లు కొనుగోలు చేసిన వారికే వీఐపీ దర్శనమని కొత్త రూల్స్‌ను ప్రవేశపెట్టారు. కానీ ఇప్పటివరకు గంగమ్మ జాతర చరిత్రలో దర్శనానికి టికెట్లు పెట్టలేదు. ఈ ఏడాది రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రత్యేక టీంతో టికెట్లు విక్రయించారు. అమ్మవారి ఒక రోజు దర్శనానికి టికెట్లు విక్రయించడంపై భక్తుల మనోభావాలు దెబ్బతీయడమే అంటూ విమర్శలు వెలువెత్తున్నాయి.



జాతరకు సీఎం.. భక్తుల అగచాట్లు

- పోలీసుల ఓవర్ యాక్షన్
- నిరీక్షించి విసిగిన భక్తులు
- కంటతడితో ఉక్కిరిబిక్కిరైన చిన్నారులు


ఆలయం ఎదుట మండుటెండలో భక్తుల అగచాట్లు

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో భాగంగా బుధవారం నిర్వహించిన విశ్వరూప దర్శనానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తారని రెండు గంటల పాటు అమ్మవారి దర్శనానికి బ్రేక్ పడింది. దీంతో ఆలయ ప్రాంగణం చుట్టూ దర్శనం కోసం వచ్చిన భక్తులు కిక్కిరిసి ఎండలో గంటల తరబడి నిలబడి విసిగివేశారిపోయారు. చంద్రబాబు దర్శనం ముగించుకుని వెళ్లినా పోలీసుల ఆంక్షలతో భక్తుల్లో తీవ్ర అసహనానికి లోనయ్యారు..

భక్తులకు తీవ్ర ఇబ్బందులు...

ప్రతి ఏడాది బుధవారం ఉదయం 9 గంటలకు విశ్వరూప దర్శనం ప్రారంభమవుతుంది. ఈక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మవారి దర్శనానికి వస్తారని ఆలయం చుట్టూ వున్నా రోడ్లన్నీ జనం తిరక్కుండా నిలిపివేశారు. ఆలయం ఎదుట ఉన్న రోడ్లకు బారికేడ్లు ఏర్పాటు చేసి నిలిపి వేశారు. నాలుగు దిక్కుల్లో రోడ్లను బంద్ చేయడంతో భక్తులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చిన్న పిల్లలు, వృద్ధులు తోపులాటకు తట్టుకోలేక కన్నీరుమున్నీరై విలపించారు. చంద్రబాబు దర్శనం ముగించుకుని వెళ్లిపోయినా పోలీసులు మాత్రం భక్తులను గంటల తరబడి నిలబెట్టడంతో మండుటెండలో నరక యాతన పడ్డారు.

సాధారణ క్యూలో ఎమ్మెల్సీ భరత్



వైఎస్సార్‌సీపీ కుప్పం ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ భరత్ సాధారణ ఉచిత క్యూలో కుటుంబ సమేతంగా వెళ్లి అమ్మ వారిని దర్శించుకున్నారు. వీఐపీ, టికెట్లు పెట్టి అమ్మవారి దర్శనానికి ఆంక్షలు పెట్టడంతో భరత్ భక్తులతో కలిసి క్యూలో వెళ్లి గంగమ్మను దర్శించుకున్నారు.

పటాలమ్మా.. కరుణించమ్మా

- కోలాహలం..పటాలమ్మ గంగజాతర
- భక్తిప్రపత్తులతో శిరస్సు మెరవణి
- జాతరకు పోటెత్తిన జనం

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో పటాలమ్మ గంగమ్మ జాతరను బుధవారం కోలాహలంగా నిర్వహించారు. దేదీప్యమైన కాంతులతో అమ్మవారు బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తుల దర్శనార్థం కొలువుదీరారు. శిరస్సు మెరవణి అనంతరం అమ్మవారిని విశ్వరూప దర్శనానికి ఉంచారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిప్రపత్తులతో శిరస్సు మెరవణి

అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి గ్రామ శివారు చౌడేపల్లి రోడ్డులోని మారెమ్మ ఆలయం నుంచి ప్రారంభమై ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ఆశీనులు చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దపంజాణి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా గ్రామంలో అధిక సంఖ్యలో మేకపోతు, కోళ్లు, పొట్టేళ్లను అమ్మవారికి బలిచ్చారు.


అమ్మవారికి దీపాలు చెల్లించి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు.


అమ్మవారి శిరస్సు ఊరేగింపు

భక్తులతో పోటెత్తిన ఆలయాలు..

గ్రామంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ముఖ్యంగా ముత్యాలమ్మ ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు దీపాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బెంగళూరులో స్థిరపడిన గ్రామానికి చెందిన శ్రీమతి వాణి, మెతుకు శ్రీనివాసులు శెట్టి (వాసు) ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదానం చేశారు. అమ్మవారికి అంబలి సమర్పణకు పెద్దసంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.

నేడు జలధి...

రెండు రోజుల గంగమ్మ జాతర గురువారం ఉదయం జలధితో పరిసమాప్తం కానుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులో జలధి కార్యక్రమం నిర్వహిస్తారు.


అమ్మవారి నిజరూప దర్శనం

నోటీస్ బోర్డు

- నేడు హనుమజ్జయంతి వేడుకలు

సదుం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తాటిగుంటపాలెం సీతమ్మగుట్ట, ఊటుపల్లె క్రాస్‌తో పాటు మండల కేంద్రంలోని కాలేజీ రోడ్డు, గార్గేయ నదీ తీరాన ఉన్న ఆలయాల్లో వేడుకలు జరగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకోవాలన్నారు.

చౌడేపల్లెలో నేడు

చౌడేపల్లె: స్థానిక బస్టాండ్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ కమలాంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకం, సాయంత్రం దీప స్తంభం, ఆకాశ దీపారాధన, రాత్రి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

రొంపిచెర్ల: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చూడాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే తనకు చెబితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారిస్తానని తెలిపారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి పైపులకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని వాడుతున్నారన్నారు నీటిని దుర్వినియోగం చేయొద్దన్నారు. గానుగచింత పంచాయతీలో సర్పంచ్‌కు తెలియకుండానే తాగునీటి బోర్లకు విద్యుత్ మోటార్లను కొనుగోలుచేసి కొందరు బిల్లుల కోసం వస్తున్నారని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల పనులు చేసినా బిల్లులు ఇంతవరకు మంజూరు చేయలేదని ఎంపీటీసీ సీరాజున్నీసా అన్నారు. అదనపు తరగతి బిల్లులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ శ్రీనివాసులు చెప్పారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంపీటీసీలు రమణమ్మ, సర్పంచ్ సుధారాణి, డీటీ లోకేష్, వ్యవసాయాధికారి సుధారాణి, ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్‌రెడ్డి, ఏపీఎం హరినాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్, ఏపీఓ బాల మురళి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

మంచి నీటి ట్యాంకు ప్రారంభం


ట్యాంకును ప్రారంభిస్తున్న అధికారులు

పలమనేరు: మండలంలోని ఏటి గడ్డిండ్లు ఎస్టీ కాలనీలో వాటర్ ఎయిడ్ సంస్థచే నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును బుధవారం ఎంపీడీఓ ఖాదర్‌బాషా ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంచి నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్న ఇలాంటి సంస్థల సేవలు ఎంతో విలువైనవన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు. మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం


విశేష అలంకరణలో స్వామి, అమ్మవారు

బైరెడ్డిపల్లె: మండలంలోని లక్కనపల్లె సమీపంలో వెలసిన నాగదేవతల ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను కల్యాణవేదికపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేదపండితుల మంత్రోచ్ఛరణతో స్వామి వారి కల్యాణం జరిగింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసింది.

వీఆర్‌ఓలను మినహాయించాలి

తవణంపల్లె: జీఓ–4 గ్రామ రెవెన్యూ అధికారులను పలు ఇబ్బందులకు గురిచేస్తోందని, దాని నుంచి వీఆర్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని వీఆర్‌ఓల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ సుధాకర్‌కు బుధవారం వీఆర్‌ఓలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, వీఆర్‌ఓలు చంద్ర, సురేష్, ప్రకాష్, కృపానందం పాల్గొన్నారు.

సేవల పేరిట వసూళ్ల దందా

- రేషన్ కార్డులో పేర్ల నమోదుకు రూ.150 వసూలు
- సర్టిఫికెట్లు కావాలంటే రూ.500 ఇవ్వాల్సిందే
- రుసుం పేరిట వసూళ్ల పర్వం
- లబోదిబో మంటున్న ప్రజలు


చారాల సచివాలయం

చౌడేపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరంగా పొందడానికి గత ప్రభుత్వం సచివాలయాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సేవలందించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను దశల వారీగా నిర్వీర్యం చేస్తూ పలు నిర్ణయాలు తీసుకుంటోంది. సచివాలయాల్లో సేవల పేరిట కొంతమంది సిబ్బంది వసూళ్ల దందాకు పాల్పడుతూ దోచేస్తున్నారు. చౌడేపల్లె మండలంలోని చారాల సచివాలయంలో రెవెన్యూ సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుం కంటే రెట్టింపు సొమ్ము వసూలు చేస్తున్నారని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చారాల సచివాలయం పరిధిలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లెకు చెందిన సుబ్రమణ్యం రెండు రోజుల క్రితం కుమారుడు ఆమూరు కుషాంత్ ప్రజ్వల్‌ను రేషన్ కార్డులో పేరు నమోదు కోసం సచివాలయానికి అన్ని ధ్రువీకరణ పత్రాలను తీసుకెళ్లాడు. కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్ చేయాల్సిన పనులను ఆయన సక్రమంగా కార్యాలయంలో ఉండక పోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం నుంచి పత్రాలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రేషన్ కార్డులో పేరు నమోదుకు సేవా రుసుం రూ.25 చెల్లించాల్సి ఉండగా వెల్ఫేర్ అసిస్టెంట్ రూ.150 వసూలు చేశారు. ఇదేమిటని.. రసీదు ఇవ్వాలని ప్రశ్నించగా, సేవా రుసుం ప్రభుత్వ ఖాతాకు చెల్లించాల్సి ఉంటుందని బదులిస్తూ దురుసుగా ప్రవర్తించినట్లు బాధితుడు వాపోయాడు. ఇలాఉండగా సచివాలయ పరిధిలో విద్యార్థులకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను పొందాలంటే వీఆర్వోలకు చేయి తడపడనిదే పనులు కావడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. ఇదే వ్యక్తి ఆదాయం, కులధ్రువీకరణ పత్రం మంజూరు కోసం వీఆర్వో వద్దకు వెళ్లగా ఏదేదో సాకులు చూపుతూ భయభ్రాంతులకు గురిచేయడంతో రూ.500 ఇచ్చి పత్రాలను పొందాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు సచివాలయాల్లో సేవా రుసుంతోపాటు అధిక మొత్తంలో సిబ్బందికి సొమ్ము ఇవ్వనిదే పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి. రెవెన్యూ సేవలకు అయితే వీఆర్వోలు, సర్వేయర్ల పరిస్థితి మరీ దారుణంగా మారిందని వేలకువేలు దండుకొని నామమాత్రంగా పనులు చేస్తున్నారని సొమ్ము ఇవ్వనిదే ఫైల్ కదలడంలేదనే చర్చ సాగుతోంది. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపంతో సచివాలయ సిబ్బంది ఆడింది ఆట పాడింది పాట అనే సామెత చందంలా తయారైందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. మండల వ్యాప్తంగా పలు సచివాలయాల్లో ఇదే తరహాలో సిబ్బంది దందా సాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పలమనేరు, కుప్పం : 93981 01870
పుంగనూరు : 96524 21441